సాక్షి
మంచిర్యాల

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025

వినాయకా.. వీడ్కోలిక

గణపతి నవరాత్రి ఉత్సవాలు తుది అంకానికి చేరుకున్నాయి. నిమజ్జనోత్సవాలు ఊపందుకున్నాయి. గురువారం చెన్నూర్, భీమారం మండలం ఎలకేశ్వరం, తాండూర్, కోటపల్లి మండలంలోని కోటపల్లి, రాపన్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఘనంగా గణనాథుడిని గంగమ్మ ఒడికి సాగనంపారు.

- వివరాలు 9లో▸



గరిష్టం/కనిష్టం
32.4 /26.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద భద్రత, సీసీ కెమెరాల్లో రికార్డింగ్ తదితర అంశాల గురించి తెలుసుకున్నారు.

శ్రీరాంపూర్ గనులకు ఫైవ్‌ స్టార్ రేటింగ్



అవార్డు స్వీకరిస్తున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా గనులు జాతీయ స్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించాయి. కంపెనీ వ్యాప్తంగా మొత్తం నాలుగు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించగా అందులో శ్రీరాంపూర్ ఏరియాలోని రెండు గనులు ఉన్నాయి. ముంబైలో గురువారం అవార్డుల ప్రదానం చేశారు. సింగరేణి సీఎండీ యన్.బలరాంనాయక్, ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. శ్రీరాంపూర్‌కు చెందిన ఆర్కే-6, ఆర్కే న్యూటెక్ గనులతోపాటు రామగుండం-3 ఏరియాకు చెందిన ఓసీపీ ఆర్జీ-1 ఏరియాకు చెందిన జీడీకే-5 ఓసీపీకి అవార్డు వచ్చాయి. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణలోకి తీసుకుని ఇచ్చిన మార్కుల ఆధారంగా ఈ రేటింగ్ ఇస్తారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



సమ్మె నోటీస్ ఇస్తున్న వర్కర్స్

పాతమంచిర్యాల: ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించే పోస్టు మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం కోరారు. జిల్లా షెడ్యూలు కులాల డెవలప్‌మెంట్ అధికారి దుర్గప్రసాద్‌ను గురువారం కలిసి సమ్మెనోటీస్ అందజేశారు. వర్కర్లకు ప్రభుత్వం 8 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. సంబంధిత మంత్రికి, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన కరువైందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వర్కర్లు సంపత్, కృష్ణ, వెంకటేష్, సునీత, శ్యామల, పద్మ ఉన్నారు.

వసతిగృహం తనిఖీ



ఆహారం పరిశీలిస్తున్న దుర్గాప్రసాద్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి(డీడీ) దుర్గాప్రసాద్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. భోజన సమయంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పరిశీలించారు. అరగంటపాటు వసతి గృహంలోనే ఉన్నారు. వంటగది, స్టోర్‌రూం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తేవాలని సూచించారు. ఆయన వెంట వసతిగృహ సంక్షేమాధికారి కుమారస్వామి ఉన్నారు.

ఎఫ్ఎస్‌వో తనిఖీ..



సరుకులను పరిశీలిస్తున్న ఎఫ్ఎస్‌వో మహేశ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహాన్ని ఫుడ్‌సేఫ్టీ అధికారి మహేశ్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం పరిశీలించారు. నాణ్యమైన సరుకులనే వాడాలని సూచించారు. స్టోర్, కిచెన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

బోధనలో వినూత్నం.. వరించిన పురస్కారం

- జిల్లాకు చెందిన ఐదుగురికి రాష్ట్ర ఉత్తమ అవార్డు
- ఉపాధ్యాయులుగా ఎవరికి వారే ప్రత్యేకం..

నిబద్ధత, వినూత్న పనివిధానం ఉంటే.. ఏ వృత్తిలో అయినా రాణించవచ్చు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం బోధనలో వినూత్న విధానం అవలంబించే ఉపాధ్యాయులకు ఏటా పురస్కారాలు అందిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రకటించింది. జిల్లాకు చెందిన దరిపల్లి స్వరూప, సుమన చైతన్య, జాడి ప్రవీణ్, దాముక కమలాకర్, నాగచందర్‌రావు తమ అసాధారణ బోధనా నైపుణ్యం, క్రమశిక్షణ, సృజనాత్మకతతో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నా రు. వినూత్న బోధనతో రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు.

– భీమారం/తాండూర్/కాసిపేట/జన్నారం



భీమారంలోని ఆర్కెపల్లి పాఠశాలలో తబలా గురించి విద్యార్థులకు వివరిస్తున్న స్వరూప

బడిని బతికించి...

భీమారం మండలం ఆర్కెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న దరిపల్లి స్వరూప, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. కేవలం ముగ్గురు విద్యార్థులతో మూసివేత దశలో ఉన్న ఈ పాఠశాలను స్వరూప తన అసాధారణ బోధనా శైలి, సమయపాలన, క్రమశిక్షణతో నడిపిస్తూ 53 మంది విద్యార్థులతో సజీవ కేంద్రంగా మార్చారు. సహజసిద్ధంగా కృత్యాధార బోధన, పిల్లలను ఆకర్షించే విధానంతో విద్యా సామర్థ్యాలను పెంపొందించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని చూరగొని, అనేక మంది పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి ఈ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చేశారు. స్వరూప స్వయంగా రచించిన కథల పుస్తకాలను విద్యార్థులతో చదివిస్తూ, వారిలో సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్నారు. ఈ విశిష్ట సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఆమెను గౌరవించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

బహుముఖ విద్యా నైపుణ్యానికి గుర్తింపు..



తాండూర్ మండలం కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న సుమన చైతన్య రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 2011లో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన ఆమె, 15 ఏళ్లలో హిందీ సబ్జెక్టులో 100% ఉత్తీర్ణత సాధించారు. సైకాలజీలో పీహెచ్‌డీ, యోగాలో పీజీ, నృత్యంలో నైపుణ్యంతో ఆమె విద్యార్థులను చైతన్యవంతం చేస్తూ ఉన్నత శిఖరాలకు చేర్చారు. గతేడాది ఇన్‌చార్జి ఎస్‌వోగా పనిచేస్తూ, ఒక విద్యార్థి సీఈసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించేలా ప్రోత్సహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా అనేక అవార్డులు పొందిన సుమన, తన విద్యా నైపుణ్యంతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

సైన్స్ బోధనలో నూతన ఆవిష్కరణ..



కాసిపేట మోడల్ స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాడి ప్రవీణ్‌ను రాష్ట్ర స్థాయి పురస్కారం వరించింది. నూతన బోధనా పద్ధతులు, ఆవిష్కరణలతో విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించి, 9 మంది విద్యార్థులకు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు, జాతీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో 5 రాష్ట్రస్థాయి విజయాలు, ఎన్‌సీఎస్‌సీలో 8 రాష్ట్ర, ఒక జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించారు. వుడ్ యాష్ ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ, రజత పతకాలు గెలుచుకుంది. నేషనల్ ఎడ్యుకేషన్ బ్రిలియన్స్ అవార్డ్స్, సైన్స్ సేవా పురస్కార్ వంటి అనేక గౌరవాలు పొందిన ప్రవీణ్, తన విజయాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, సహ ఉపాధ్యాయులే కారణమని తెలిపారు.

క్రమశిక్షణ, విద్యా చైతన్యానికి గుర్తింపు..



జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన దాముక కమలాకర్, విద్యాబోధనతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి నడవడికను అలవర్చి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించడంతో పాటు, విద్యార్థులను చైతన్యవంతం చేసి, ప్రేరణ కల్పించడంలో కమలాకర్ కృషి గుర్తింపు పొందింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న ఆయనకు స్థానికులు అభినందనలు తెలియజేశారు.

హాజరుశాతం పెంచి..



చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నాగచందర్‌రావు రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పురస్కారం అందుకోనున్నారు. 27 ఏళ్ల అధ్యాపక వృత్తిలో నాగ చందర్‌రావు 24 ఏళ్లు అధ్యాపకుడిగా పనిచేశారు. వరంగల్ జిల్లాలోనే 16 ఏళ్లు జూనియర్ లెక్చరర్‌గా పని చేశారు. 2021లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై 2023లో పీహెచ్‌డీ పూర్తి చేసి గవర్నర్ చేతుల మీదుగా పట్టా పొందారు. చెన్నూర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నాగచందర్‌రావు విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి కృషి చేశారు. గతేడాది చెన్నూర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించారు. రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన నాగచందర్‌రావును కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

ప్రణాళికతో...



ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. గతేడాది రాష్ట్ర మూడో ర్యాంక్ రాగా, ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ కోసం కృషి చేస్తున్నాం. నాకు ప్రభుత్వం అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో బాధ్యత మరింత పెరిగింది.

– పి.నాగచందర్‌రావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల చెన్నూర్

ఎరువు దరువు !

- యూరియాకు విపరీత డిమాండ్
- గణనీయంగా పెరిగిన వినియోగం..
- డిమాండ్, సరఫరాలో వ్యత్యాసం
- రాజకీయ అస్త్రంగా మారిన వైనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వానాకాలం పంటలకు రైతులకు ఎరువు దొరకడం లేదు. ముఖ్యంగా యూరియా కోసం రైతులు తంటాలు పడుతున్నారు. నిత్యం పీఏసీఎస్‌లు, దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లాలో 3.33 లక్షల ఎకరాల్లో పంటల సాగవుతాయని అంచనా వేయగా, వర్షాల ఆలస్యం కారణంగా 3.11 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. ఇందులో 1.60 లక్షల ఎకరాల్లో పత్తి, 1.10 లక్షల ఎకరాల్లో వరి, మిగిలినవి మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు వంటి పంటలు ఉన్నాయి. జిల్లాకు 28 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఇప్పటివరకు 22,225 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చింది. వీటిలో 7 వేల మెట్రిక్ టన్నుల యూరియాతోపాటు డీఏపీ, ఎన్‌పీకే వంటి ఇతర ఎరువులు ఉన్నాయి. పత్తి, వరి పంటలకు యూరియా వాడకం పెరగడంతో డిమాండ్ గణనీయంగా పెరిగింది. చెన్నూరు, తాండూరు, దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం, కోటపల్లి మండలాల్లో సహకార, ప్రైవేటు దుకాణాల వద్ద యూరియా కోసం రైతులు నిత్యం క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. సరిపడా దొరకకపోవడంతో పోలీసుల సమక్షంలో ఎరువుల పంపిణీ జరుగుతోంది.



యూరియా కోసం కోటపల్లిలో రైతుల బారులు..

సరఫరాలో లోపాలు..

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎరువుల సరఫరాలో వ్యత్యాసం కనిపిస్తోంది. పంట విస్తీర్ణం పెరగడం, వ్యవసాయ శాఖ అంచనాలకు వాస్తవ సాగు వివరాలకు తేడాలు ఉండటం సరఫరా సమస్యకు ప్రధాన కారణం. కొంతమంది పెద్ద రైతులు, ఆర్థిక స్థోమత ఉన్నవారు యూరియా కొరతను ముందుగానే అంచనా వేసి బస్తాల కొద్దీ నిల్వ చేసుకున్నారు. దీంతో కొందరు వ్యాపారులు తమకు తెలిసిన వారికి ఎక్కువ బస్తాలు ఇచ్చి లాభం పొందారు. వర్షాలు ఒకేసారి కురవడంతో యూరియా డిమాండ్ గణనీయంగా పెరిగింది. యూరియా బదులు ఇతర ఎరువులను రైతులకు అంటగట్టి అధిక ధరలకు విక్రయించారు. బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలిస్తూ మూడు చోట్ల అధికారులకు దొరికిపోయారు. ఒకేసారి విత్తనాలు వేయడం, ఎరువుల మోతాదు మించి వాడటం, సేంద్రియ ఎరువులను నిర్లక్ష్యం చేసి రసాయన ఎరువులపై ఆధారపడటం కూడా డిమాండ్ పెరుగుదలకు కారణమైంది.

మంత్రి, ఎమ్మెల్యే చొరవతో సరఫరా..

మంచిర్యాల నియోజకవర్గంలో రైతుల ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఈ నెల 10లోపు 400 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు అవసరాన్ని బట్టి పంపిణీ చేస్తామని తెలిపారు. గత నెలలో మంత్రి వివేక్ చొరవతో చెన్నూరు నియోజకవర్గానికి 420 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. అయినప్పటికీ, జిల్లాకు ఇంకా 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంది.

ఇబ్బంది లేకుండా చర్యలు

జిల్లాలో ఇప్పటికే సరిపడా యూరియా పంపిణీ చేశాం. రైతుల డిమాండ్ దృష్ట్యా ఎప్పటికప్పుడు అవసరమేరకు పంపిణీ చేస్తున్నాం. అక్రమాలకు పాల్పడిన డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరికీ యూరియా అందుతుంది.

– ఛత్రునాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

జీపీవోలు వస్తున్నారు..

- 120 మంది నియామకానికి లైన్ క్లియర్
- ఒక్కో జీపీవోకు 2 నుంచి 3 గ్రామాల బాధ్యతలు
- నేడు హైదరాబాద్‌లో పోస్టింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో గ్రామ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసేందుకు 120 మంది గ్రామ పరిపాలన అధికారుల (జీపీవో) నియామకం కొలిక్కి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వీరు పోస్టింగులు అందుకోనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి, ధరణి పోర్టల్ ద్వారా భూమి రిజిస్ట్రేషన్‌లను తహసీల్దార్లకు అప్పగించడంతో రెవెన్యూ వ్యవస్థలో సమస్యలు తలెత్తాయి. ధరణిపై విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దుచేసి, భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. వీఆర్‌వో, వీఆర్‌ఏలను మాత్ర శాఖలోకి తిరిగి తీసుకొచ్చి, జీపీవో వ్యవస్థను ఏర్పాటు చేసింది.

168 క్లస్టర్లలో 120 మంది జీపీవోలు..

జిల్లాలోని 16 మండలాలు, 306 గ్రామ పంచాయతీలు, 385 రెవెన్యూ గ్రామాలను 168 క్లస్టర్‌లుగా విభజించారు. గతంలో వీఆర్‌వో, వీఆర్‌ఏలుగా పనిచేసి, ఇతర శాఖల్లో విలీనమైన వారికి ప్రభుత్వం రెండుసార్లు తిరిగి రెవెన్యూ శాఖలో చేరే అవకాశం కల్పించగా, 120 మంది అర్హత సాధించారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన ఈ అధికారులకు ఒక్కో క్లస్టర్‌లో రెండు నుంచి మూడు రెవెన్యూ గ్రామాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. మిగిలిన 45 ఖాళీలను త్వరలో ఇన్‌చార్జి జీపీఓలతో భర్తీ చేయనున్నారు.



గుడిపేట గ్రామ పంచాయతీ భవనం

ఉదయం హైదరాబాద్‌కు..

సెప్టెంబరు 5న ఉదయం 7 గంటలకు మంచిర్యాల ఐడీవోసీ కార్యాలయానికి చేరుకోవాలని జీపీవోలకు కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి చేతుల మీదుగా పోస్టింగ్ ఆర్డర్లు అందుకున్న అధికారులను మూడు బస్సుల్లో జిల్లాకు తీసుకొస్తారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య పర్యవేక్షణలో ఒక్కో బస్సుకు ఒక నాయబ్ తహసీల్దార్, ఒక కానిస్టేబుల్ ఉంటారు. జీపీవోలకు భోజన వసతితోపాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

భూమి చదును చేసిన వారిపై ఆరా..

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి శివారులో సర్వే నంబర్ 444 గూడెం, రంగంపల్లె సమీపంలోని సీపీ ప్రతిపాదిత భూమితోపాటు, ప్రభుత్వ భూమిలో కొంత స్థలాన్ని కొందరు వ్యక్తులు చదును చేశారు. ‘అటవీ భూమి కబ్జా’ శీర్షికన ‘సాక్షి’ దీనిపై గురువారం కథనం ప్రచురించింది. స్పందించిన రెవెన్యూ, ఫారెస్టు, ఆర్‌అండ్‌బీ అధికారులు చదును చేసిన స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, ఆర్ఐ భూమన్న, సర్వేయర్ దినేష్, ఎఫ్ఎస్‌వో నరేశ్ చదును చేసిన స్థలాన్ని పరిశీలించి, సర్వేచేయగా, అందులో సీపీ ప్రతిపాదిత ల్యాండ్ 1.08 ఎకరాలు, ప్రభుత్వ స్థలం ఎకరం ఉన్నట్లు గుర్తించారు. ఎవరు చదును చేశారు? ఎందుకు చేశారు అని ఆరా తీశారు. వివరాలు సేకరించి, బాధ్యులపై చర్య తీసుకుంటామని డీటీ మాధవి తెలిపారు. చదును చేసిన స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



భూమిని పరిశీలిస్తున్న అధికారులు..

ఎంజేపీ ఆర్‌సీవోకు గురుబ్రహ్మ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీధర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మా జ్యోతిబాపూలే ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీవో) పేరు శ్రీధర్ గురువారం గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రామానుజన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్‌నారాయణ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. విద్యారంగంలో ఆయన విశిష్ట సేవలు గుర్తించి అవార్డు ప్రదానం చేశారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌కు..



అవార్డు అందుకుంటున్న బుచ్చన్న

మంచిర్యాల అర్బన్: గణిత ఒలింపియాడ్‌లో చేసిన విశేష సేవలకు హైదరాబాద్ శ్రీనివాస రామానుజన్ పౌండేషన్ మంచిర్యాల మోడల్ స్కూల్ ప్రి న్సిపాల్ బుచ్చన్న గురుబ్రహ్మ అవార్డు ప్రదానం చే సింది. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ నారా యణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నిమజ్జనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిషోర్ ఝా
- జిల్లాలో నిమజ్జన పాయింట్ల సందర్శన

మంచిర్యాలక్రైం: గణపతి నిమజ్జనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల ఏర్పాట్లను స్థానిక డీసీపీ భాస్కర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. శోభాయాత్ర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు, కమిటీ నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి, అవాంఛనీయ సంఘటనలను నివారించాలన్నారు. జిల్లా కేంద్రంలో శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించి, ప్రధాన చౌరస్తాల వద్ద ప్రత్యేక బృందాలను నియమించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇందారం సమీపంలోని గోదావరిఖని బ్రిడ్జి, గూడెం సమీపంలోని రాయపట్నం బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పాయింట్ల ఏర్పాట్లను కూడా పరిశీలించారు. శోభాయాత్రను వీడియోగ్రఫీ, డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. డీజే, బాణసంచా వాడకాన్ని నిషేధించినట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు మత సామరస్యానికి ప్రతీకగా, శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. వారి వెంట మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ సంపత్ కుమార్, ఏసీపీ ప్రకాశ్, సీఐ ప్రమోద్‌రావు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.



రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ కుమార్ దీపక్

వైద్య సిబ్బందికి హెపటైటిస్ వ్యాక్సిన్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు, వైద్య సిబ్బందికి ఈ నెల 8, 9, 10 తేదీల్లో హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి అనిత తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని వైద్యులు, వైద్య సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాలో పనిచేస్తున్న 1,590 మంది వైద్యులు, ఆరోగ్య సిబ్బంది హెపటైటిస్-బి వ్యాక్సిన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 8న మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనివారికి, 9, 10 తేదీల్లో లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులు, వైద్య సిబ్బందికి వ్యాక్సిన్ వేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు శ్రీమన్నారాయణ, శ్రీధర్, డీసీహెచ్ కోటేశ్వర్‌రావు, వైద్యులు సుగుణాకర్‌రావు, సుధాకర్‌నాయక్, డీసీపీ మధు, డీపీవో ప్రశాంతి, ప్రవళిక, భాగ్య, సదన్, భారతి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు అరుణ, అపరంజిత తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ అనిత

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మందమర్రిరూరల్: వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత సూచించారు. మందమర్రి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులాన్ని గురువారం సందర్శించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. ఎవరికీ మలేరియా, డెంగీ పాజిటివ్ రాలేదని తెలిపారు. 14 మందికి చర్మ సంబంధ వ్యాధులకు సంబంధించి మందులు అందించారు. ముగ్గురికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ప్రభుత్వ వైద్యాధికారి రమేశ్, మానస, వైద్య సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

కాలువలో పడి బాలుడి మృతి


జయరాజ్ మృతదేహం

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ (12) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..బుధవారం మధ్యాహ్నం తల్లి బత్తుల లతీకతో కలిసి తోటకు కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం అందరితో కలిసి భోజనం చేసిన తర్వాత పక్కనే ఉన్న కెనాల్‌లో ఆడుకోవడానికి వెళ్లాడు. ఆ సమయంలో భారీ వర్షం పడడంతో ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. చాలాసేపటి తర్వాత గమనించిన తల్లి, గ్రామస్తులు జయరాజు కోసం వెతకగా కాలువలో ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై, సిబ్బంది కాలువలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. జయరాజ్ తండ్రి గత కరోనాలో మృతిచెందగా, తల్లి కూలీ చేసుకుంటూ బతుకుతోంది. కాగా జయరాజుకు మానసిక స్థితి సరిగాలేదని, ఇంట్లోనే ఉంటాడని రూరల్ ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కిందపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి(35) ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జస్పాల్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాల శివారు గోదావరి బ్రిడ్జి సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందింది. ఈ మేరకు ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి శరీరంపై నీలిరంగు టీషర్ట్, గోధుమ కలర్ చెప్పులు, నల్లటి గడ్డం, కుడి చేతికి రబ్బరు కడియం ధరించి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే 8712658596, 9849058691 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన ఎల్పుల లక్ష్మయ్య (47) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన డబ్బులు మద్యం తాగేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంటిలేషన్ మెరుగుపర్చాలి


మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: గనిలోని 21 లెవెల్, 5 సీమ్‌లో వెంటిలేషన్ మెరుగుపర్చాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 5 గనిని సందర్శించి కార్మికుల కలిసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్ల ఇటీవల రాత్రి షిఫ్ట్‌లో ఒక కార్మికుడు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరాడని తెలిపారు. బ్యాంక్ హెడ్‌పై ఉన్న రేకులు పగిలిపోయి వర్షపు నీరు చేరడంతో ఆ ప్రాంగణమంతా బురదమయంగా మారిందన్నారు. దీంతో టబ్బులు నడిపేటప్పుడు కార్మికులు జారి పడుతున్నారని తెలిపారు. గనిలో ట్రాక్‌లైన్ క్లీనింగ్ మెయింటెనెన్స్ జరుగకపోవడంతో తరచూ టబ్బులు పడిపోతున్నాయన్నారు. అధికారులకు బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ రక్షణపై లేదన్నారు. ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, తిరుపతి రాజు, పేరం రమేశ్, జీవన్ జోయల్, మల్లారెడ్డి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి నంబయ్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మోత రవి నాయకులు రాజేందర్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బడిని బతికించాడు


పాఠం బోధిస్తున్న హెచ్‌ఎం శివప్రసాద్

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది విద్యార్థుల సంఖ్య 5 ఉండేది. బడి మూతపడకుండా ఎలాగైనా బతికించుకోవాలనే ఉద్దేశంతో హెచ్‌ఎం శివప్రసాద్ వేసవి సెలవుల్లో ఇంటింటా తిరి గాడు. మీ పిల్లలను ప్రైవేటుకు పంపద్దు, ప్రభుత్వ బడికే పంపాలని తల్లిదండ్రులను కోరాడు. బడి పునఃప్రారంభమైన తర్వాత విద్యార్థుల ఇళ్లకు మరోసారి వెళ్లాడు. కొత్త అడ్మిషన్లలో భాగంగా విద్యార్థుల సంఖ్యను 38కి చేర్చాడు. మూతబడే బడిని హెచ్‌ఎం చొరవతో బతికించి ఆదర్శంగా నిలిచాడు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్ తదిర విద్యాసామగ్రిని హెచ్‌ఎం అందిస్తు విద్యార్థులకు సహకరిస్తున్నాడు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి..



కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని జీడిచేను ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం పుల్లూరి బాలకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు రెండేళ్లుగా కృషిచేస్తున్నాడు. 20 నుంచి 53 మందిని సంఖ్య పెంచారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. టీచింగ్ లెర్నింగ్ విధానంలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ వంటి విషయాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాడు. పిల్లలు బడికి ప్రతీరోజు పాఠశాలకు వచ్చేలా వంద శాతం హాజరైన వారికి బహుమతులు అందజేస్తూ డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నాడు. – పుల్లూరి బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, జీడిచేను, ఎంపీపీఎస్



• పిల్లలను తీర్చిదిద్దుతున్న టీచర్లు
• వారి ఉన్నతికి, బడి బాగుకు కృషి
• ఆటబొమ్మలతో విద్యాబోధన
• నేడు ఉపాధ్యాయ దినోత్సవం

మాస్టార్లు

విద్యార్థి భవిష్యత్తు పాఠశాలలోనే రూపుదిద్దుకుంటుంది. డాక్టర్ అయినా, సైంటిస్ట్ అయినా, పొలిటీషియన్ అయినా, రచయిత అయినా, రాజకీయ నాయకుడు అయినా గురువు శిష్యులే.. మంచి ఉపాధ్యాయుడు చెక్కిన విద్యార్థి భవిష్యత్ ఉన్నతంగా ఉంటుంది. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది గురువు. పాఠశాల బాగుకు, విద్యార్థుల ఉన్నతికి, బడిమానేసిన వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషిచేస్తున్నారు. చదువులో వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. పాఠాలు సులువు అర్థమయ్యేలా గోడలపై రంగురంగుల బొమ్మలు గీస్తూ బోధన చేస్తున్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న.. ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోస్తున్న కొంత మంది ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.

వినూత్న రీతిలో విద్యాబోధన


టీఎల్‌ఎం ద్వారా విద్యాబోధన చేస్తున్న శ్రీనివాస్

జన్నారం: అక్కపెల్లిగూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జాజల శ్రీనివాస్ వినూత్న రీతిలో బోధన చేస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నాడు. విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసేందుకు టీఎల్‌ఎం, ఉదాహరణలు వాడుతున్నాడు. నాలుగేళ్ల క్రితం శ్రీనివాస్ పానకల్‌లో హెచ్‌ఎంగా పని చేసే సమయంలో 30 మంది విద్యార్థుల సంఖ్య ఉండేది. గురుకుల, నవోదయ కోచింగ్‌లు ఇస్తూ అనేక మందిని గురుకుల పాఠశాలల్లో చేరేదుకు కృషి చేయగా దీంతో సంఖ్య 200కు పెరిగింది. గతేడాది అక్కపెల్లిగూడ పాఠశాలకు హెచ్‌ఎంగా బదిలీ అయ్యాడు. అయితే టీచర్ వెంటే మేము అన్నట్లు 180 మంది విద్యార్థులు తిరిగి అక్కపెల్లి గూడ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం పాఠశాలలో 314 మంది సంఖ్య ఉంది. శ్రీనివాస్ రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

సైన్స్‌పై మక్కువ పెంచేలా..



కాగజ్‌నగర్ కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ పెంచేందుకు ఫిజిక్స్ ఉపాధ్యాయులు ప్రసన్న వినూత్న రీతిలో బోధన చేస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో వారిని పాల్గొనేలా కృషి చేస్తున్నారు. మూడేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 2023లో హర్యాణలోని ఫరీదాబాద్‌లో నిర్వహించిన ఇండియన్ ఇటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టుకు బోధన!


విద్యార్థులకు బోధిస్తున్న టీచర్ సాంబయ్య

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల బలహీనతలు అధిగమించడానికి, ప్రతిభ పెంచడానికి స్థానిక చెన్నూర్ రోడ్ పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సాంబయ్య ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు. గ్రామీణప్రాంతానికి చెందిన దాదాపు 150 మందికిపైగా బీసీ సమీకృత వసతిగృహంలో ఉంటూ చెన్నూర్ రోడ్ పాఠశాలలో చదువుకుంటున్నారు. తెలుగు మీడియం విద్యార్థులు కావడం.. ఆంగ్లంపై ప్రావీణ్యం లేకపోవడంతో చదువుల్లో తడబడ్డారు. ఉపాధ్యాయుడు పాఠశాల సమయం ముగియగానే వసతిగృహంలో తరగతులు బోధిస్తూ వస్తున్నాడు. ఉదయం ప్రత్యేక తరగతులతో ఆంగ్లంలో మెలకువలు నేర్పిస్తున్నాడు.

విద్యార్థులతో ప్రయోగాలు



విద్యార్థులను ప్రయోగాల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహిస్తున్నా. ప్రతీ ఏటా ఇన్‌స్పైర్ మనక్, నేషనల్‌చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్, బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులను భాగస్వాములు చేయిస్తాను. జిల్లా, రాష్ట్ర స్థాయిలో 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారు. వ్యక్తిగత విభాగాలలో టీచర్ నూతన బోధనోపకరణాల తయారీలో 2022లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, కేరళలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొని బహుమతి సాధించాను.
– మామిడాల తిరుపతయ్య, జెడ్పీఎస్ఎస్ పెట్రోల్‌పంప్, కాగజ్‌నగర్

డ్రాపౌట్ తగ్గింది.. హాజరుశాతం పెరిగింది

భీమిని: ప్రైవేటుకు దీటుగా కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు హెచ్‌ఎం అంకతి తిరుపతి, ఉపాధ్యాయురాలు రాథోడ్ సంగీత. పాఠశాలలో 48 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ఆవరణలో పూలు, పండ్ల, కూరగాయల మొక్కల పెంపకం చేపట్టారు. వీటి పోషక విలువలను టీచర్లు ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. ఇక్కడ పండించిన కూరగాయాలను మధ్యాహ్న భోజనానికి ఉపయోస్తున్నారు. టీచర్లు సొంత ఖర్చులతో ప్రత్యేకంగా రీడింగ్ కార్నర్ ఫ్లెక్సీలు ఇచ్చారు. ఇంట్లో అనుకూలంగా చదువుకునేందుకు అనువైన చోట ఏర్పాటు చేసుకునేలా తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో సంచాయక పొదుపు పథకం ఏర్పాటు చేసి ఆర్థిక క్రమశిక్షణ అలవాటు కల్పించారు. ఇప్పటి వరకు రూ.5 వేలు పొదుపు పథకంలో జమ చేసుకున్నారు. పాఠశాల ప్రహరీలకు రంగు రంగుల బొమ్మలు, ఫ్లాగ్‌లు ఏర్పాటు చేశారు.


ప్రహరీకి వేసిన రంగురంగుల బొమ్మలు, ఫ్లాగ్‌లు

మరాఠి నుంచి తెలుగుకు..

కెరమెరి: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని లేండిగూడ గ్రామంలో తెలుగు, మరాఠి మీడియం పాఠశాలలు ఉన్నాయి. అక్కడి మాతృభాష మరాఠి. మన పాఠశాలపై అంతగా శ్రద్ధ చూపరు. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కాంత్రికుమార్ చేరడంతో బడి రూపురేఖలు మారాయి. 2022లో హెచ్‌ఎంగా ఉన సమయంలో30 మంది విద్యార్థులున్నారు. అందులో బడికి వచ్చేవారు 15 మంది. వారికి ప్రత్యేక బోధనపై దృష్టి సారించారు. ప్రధాన సబ్జెక్టుల్లో జీకేను ప్రవేశపెట్టారు. టీలివర్స్ అకాడమీ పేరుతో యూటూబ్ చానెల్‌కు తయారు చేసి టీఎల్‌ఎం ద్వారా బోధన చేస్తున్నారు. దీని వల్ల ఎస్‌సీఈఆర్టీ ద్వారా రాష్ట్రర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఇటీవల ఎఫ్‌ఎల్‌ఎన్ ఎక్స్‌ఎల్‌కి ఎంపికైంది. ఆయన చేసిన కృషితో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 47కు చేరింది. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఉచిత గైడ్లు, ప్లేట్లు, గ్లాసులు, టై, బెల్టులు అందించారు.

ఇద్దరిని కాపాడి..వాగులో గల్లంతైన ఒకరు

• మల్లెంగిలో విషాదం


గల్లంతై మృతి చెందిన జాడే శంకర్


ప్రాణాలతో బయట పడిన జాదవ్ మిట్టు

నార్నూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలు జనజీవనం అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో మండలంలోని మల్లెంగి వాగు పొంగింది. అదే గ్రామానికి చెందిన మొత్తం 9 మంది రైతులు వ్యవసాయ పనుల కోసం వాగు అవతల ఒడ్డుకు ఉదయం చేరుకున్నారు. దినమంత పనిచేసి సాయంత్రం 5 గంటలకు తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయల్దేరారు. గ్రామ సమీపంలోని వాగులో నీటి ప్రవాహం తక్కువ ఉండడంతో జాడే శంకర్ (42)తోపాటు, మరో ఇద్దరు రైతులు జాదవ్ మిట్టు, జాదవ్ మిథున్‌లతో కలిసి వాగు దాటే సాహసం చేశారు. అప్పటికే వాగులో భారీగా వరద నీరు ఒకే సారి రావడంతో ఉధృతి పెరిగింది. పరిస్థితిని గమనించిన శంకర్ ఇద్దరు రైతులను ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు. ఆయన బయటి వచ్చే క్రమంలో వరద ఉధృతికి గల్లంతయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో మృతదేహం కిలోమీటరు దూరంలో వాగులో లభించిందని ఎస్సై అఖిల్ తెలిపారు. మృతుడికి భార్య జాడే సరిత, ఇద్దరు కూమారులు ఉన్నారు.

చంటిబిడ్డతో వాగు దాటి ఆస్పత్రికి


చంటిబిడ్డతో వాగు దాటుతున్న ఈశ్వరిబాయి


కాలినడకన వెళ్తున్న ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ గ్రామానికి చెందిన పెందోర్ ఈశ్వరి ఐదు నెలల బాలింత చంటిబిడ్డతో ఎత్తుకుని వాగు దాటి ఆస్పత్రికి తీసుకెళ్లింది. పెందోర్ ఈశ్వరిబాయి చంటిబిడ్డకి రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. భారీ వర్షం కారణంగా వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోయింది. గురువారం వాగులో వరదనీరు కొంత తగ్గడంతో తల్లి ఆర్క గంగుబాయితో కలిసి సంకలో చంటి పాపను ఎత్తుకుని ప్రాణాలను తెగించి వాగు దాటింది. అక్కడి నుంచి కాలినడన ఆంధ్‌మామిడిగూడ వరకు వచ్చి ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం అందించారు. వాగు వద్ద బ్రిడ్జి లేక ప్రతిఏటా వర్షాకాలంలో అత్యవసర సమయంలో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు దృష్టిసారించి మంజూరైన నిధులతో మామిడిగూడ వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

మద్యం విక్రయిస్తున్న పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా వైన్స్, బెల్టుషాపులు మూసివేయాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలువురు అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతూ పట్టుబట్టారు. పక్కా సమాచారంతో గురువారం దాడి చేసిన మావల పోలీసులు పలు బీరు సీసాలను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. దస్నాపూర్‌లో 37, మావలలో 35 లిక్కర్ బాటిళ్లు, బాలాజీనగర్‌లో 14 బీరు బాటిళ్లు, కేఆర్కే కాలనీలో 4 బీర్ బాటిళ్లు, 2 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు సమష్టి కృషి


మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిరూరల్: ఏరియాలో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమష్టిగా కృషి చేద్దామని జీఎం రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఏరియాలోని కేకే–5 గనిని సందర్శించి గణపతి మండపం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియాతో తనకు 8 ఏళ్ల అనుబంధం ఉందని, వివిధ హోదాల్లో ఇక్కడ విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్కే ఓ సీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అనంతరం గని ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్, అధికారులతో కలిసి గనిలోకి దిగి పని ప్రదేశాలను పరిశీలించారు.

గంజాయి కేసులో ముగ్గురికి జైలు

కాగజ్‌నగర్‌రూరల్: గంజాయి కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వి రమేశ్ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2021 ఏప్రిల్ 25న పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా అంబేద్కర్ కాలనీకి చెందిన జాడి శ్రీకర్ అలియాస్ శ్రీకాంత్ వద్ద గంజాయి లభించింది. మండలంలోని కోసిని వద్ద గల సాయి కిశోర్ తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని లాభార్జన కోసం ఇతరులకు అమ్ముతున్నట్లు శ్రీకర్ చెప్పాడు. అప్పటి ఎస్సై ఎండీ తహసీనొద్దీన్.. సాయికిశోర్ ఇంట్లో తనిఖీ చేసి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. అతని విచారించగా సిర్పూర్(టి) మండలం కొలాంగూడకు చెందిన ఆత్రం భీం వద్ద గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు అంగీకరించాడు. అతని ఇచ్చిన సమాచారంతో ఆత్రం భీం ఇంట్లో తనిఖీ చేపట్టగా 1.2 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఆత్రం భీం చేనులో పత్తి, కంది మధ్యలో గంజాయిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అప్పటి ఎస్సై వెంకటేశ్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మోహన్ విచారణ జరిపారు. పట్టణ సీఐ ప్రేం కుమార్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్ వాదనలు వినిపించి నేరం రుజువు చేశారు. గంజాయి సరఫరా చేసిన జాడి శ్రీకర్, సాయికిశోర్‌లకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా, గంజాయి సాగు చేసిన ఆత్రం భీంకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్మోహన్‌రావు, ఇన్‌చార్జి ఏఎస్పీ చిత్తరంజన్, పట్టణ సీఐ ప్రేంకుమార్, ఆసిఫాబాద్ డివిజన్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్‌ను ఎస్పీ అభినందించారు.

6న గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సమావేశం


మాట్లాడుతున్న గోడం గణేశ్

ఉట్నూర్‌రూరల్: ఈనెల 6న గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సమావేశం ఉట్నూర్‌లోని మత్తడిగూడ రాయిసెంటర్ భవనంలో నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాటసమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ తెలిపారు. ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడా, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్నిరోజుల క్రితం నోటీసులు జారీ చేసిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఆదివాసీ 9 తెగల గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడీలు, గ్రామపటేల్, దేవరీలు, కుల సంఘాలు, ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ నాయకులు, తాజా మాజీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి, ఆత్రం తిరుపతి, మాజీ జిల్లా అధ్యక్షుడు, ఆడ హనుమంత్ రావు గోండ్వాన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, సిడం సోనేరావు పటేల్ మెస్రం నాగ్నాథ్, ఇంద్రవెల్లి మండలం తుడుందెబ్బ మాజీ అధ్యక్షుడు మాధవి యశోద, మోతీరాం, మత్తడిగూడ మాజీ సర్పంచ్, ఆదివాసీ నాయకులు కుమ్ర వినాయక్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీలో పలువురికి చోటు

శ్రీరాంపూర్: హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీలో పలువురికి చోటు కల్పిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య గురువారం తెలిపారు. కేంద్ర కార్యదర్శులుగా జి.సత్యనారాయణ, మీసా కొమురయ్య, ఏ.అనిల్, ఉపాధ్యక్షులుగా బోనాల శ్రీనివాస్, దుర్గం లక్ష్మణ్, పులి రాజిరెడ్డి, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కొల్లూరి శ్రీను, అశోక్ రెడ్డి, పంబల రాములును నియమించారు. వీరి నియామకం పట్ల శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

బ్రిడ్జి తెగింది.. ప్రయాణం ఆగింది



ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని హరిఓం నగర్‌లో బ్రిడ్జి కొట్టుకుపోగా రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆ కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహనదారులు బయటకు రాలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతు చేపట్టి రాకపోకలు జరిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్